క్లుప్తంగా


ట్రాప్ కెమెరాల ఏర్పాటు



ట్రాప్ కెమెరాను ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ అధికారులు

మిడుతూరు: స్థానిక సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పరిసరాలలో అటవీశాఖ అధికారులు ట్రాప్ కెమెరాలను బుధవారం ఏర్పాటు చేశారు. గత రెండురోజుల క్రితం సమ్మర్ స్టోరేజ్ పరిసర ప్రాంతాలలో చిరుత సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి తాహీర్ పాదముద్రలను పరిశీలించారు. చిరుతపులేనా? కాదా? తెలుసుకొనేందకు రెండు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఎఫ్‌బీఓ శ్రీనివాసులు, బర్డ్ వాచర్ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

మహానందీశ్వరుడి సేవలో టీపీడీసీ



ఆశీర్వచనం అందుకుంటున్న కన్జర్వేటర్ కృష్ణమూర్తి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో టైగర్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ కన్జర్వేటర్ కృష్ణమూర్తి బుధవారం పూజలు చేశారు. నూతనంగా వచ్చిన ఆయన ముందుగా కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్థానిక యాగశాలలో వేదపండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. అనంతరం నంద్యాలకు వెళ్లి బాధ్యతలు తీసుకున్నట్లు తెలిసింది.

సాక్షి గణపతికి విశేష పూజలు



సాక్షిగణపతి



జ్వాలా వీరభద్రస్వామి

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణార్థం శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం సాయంత్రం సాక్షిగణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతం, ఫలోదకం, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామి వారికి అభిషేకం, విశేష పుష్పార్చన చేశారు.

మద్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, స్కూటర్

శ్రీశైలం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద మద్యం బాటిళ్లు కలిగి ఉన్న ఇద్దరిని బుధవారం సాయంత్రం వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ ప్రసాద్‌రావు వివరాల మేరకు.. బోయ రమేష్, వినుకొండకు చెందిన డోకు మల్లేశ్వరరావు స్కూటీలో మద్యం బాటిళ్లు తీసుకొస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. తనిఖీ చేసి వారి వద్ద నుంచి 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేశామని, ఇందుకు సహకరించిన వన్‌టౌన్ పోలీసులు రాజేంద్ర కుమార్, రఘునాథుడు, మహేష్, నారాయణ, నానునాయక్, బాలకృష్ణలను సీఐ అభినందించారు.

యువకుడికి గాయాలు



ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

మిడుతూరు: మండల కేంద్రం నుంచి రోళ్లపాడు గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని బొలెరో వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రోళ్లపాడు గ్రామానికి చెందిన యెహాన్ ద్విచక్ర వాహనంపై మిడుతూరుకు వచ్చి పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వెళుతున్నాడు. సుంకేసుల బాట సమీపంలో ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టడంతో యోహాన్ కుడి కాలుకు గాయమైంది. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వానగండం



బావాపురం సమీపంలో వర్షానికి నేలవాలిన వరి పైరు

కొత్తపల్లి: మూడు రోజులుగా మండలంలో కురుస్తున్న జోరు వానలకు రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని పాలెం చెరువుగూడెం, బండినాయిని పాలెం, గువ్వలకుంట్ల, జి.వీరాపురం, కొత్తపల్లి, శివపురం, పెద్దగుమ్మడాపురం, బావాపురం, నందికుంట గ్రామాలలో వరి పంటలను సాగుచేశారు. వరి సాధారణ సాగు విస్తీర్ణం 1386 హెక్టార్లు కాగా ఈ ఏడాది 1095 హెక్టార్లలో రైతన్నలు వరి సాగుచేసుకున్నారు. ఈ పైర్లన్నీ ప్రస్తుతం కంకి దశలో దశలో ఉన్నాయి. ఈ స్థితిలో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వరిపైరు కాస్తా నేలవాలుతోంది. మరో 20 రోజులు ఉంటే పూర్తిగా కోత దశకు చేరుకుంటాయి. ఇంతలో అకాల వర్షం అపార నష్టం కలిగించేలా ఉందని వరి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వరిపైరు నేలవాలితే గింజలు రాలి దిగుబడి తగ్గడంతో పాటు నాణ్యత కూడా తగ్గుతుందని బాధ వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. ఆమె బుధవారం మండల పరిధిలోని శివపురం, ఎం.లింగాపురం గ్రామాల మధ్యలోని ఎద్దులేరు వాగును పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. వర్షప్రభావం ఇంకా పెరగొచ్చని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలోని ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. అదేవిధంగా వర్షాలు పెరిగితే శివపురం సమీపంలోని ఎద్దులేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుందని అవతలివైపు ఉన్న గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉండడంతో ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వర్షాల వల్ల ఇబ్బందులు ఏర్పడితే తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. వీఆర్వో బాబు మియా వెంట ఉన్నారు.



వీరాపురం సమీపంలో పడిపోయిన వరిపైరును కాపాడుకునేందుకు కట్టలు కట్టిన దృశ్యం



ఎద్దులేరు వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమారాణి

ఆత్మకూరులో మోస్తరు వర్షం

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 15.06 మి.మీ. వర్షపాతం నమోదైంది. మంగళవారం 4.04 మి.మీ. వర్షం కురిసింది. రెండు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కోత కోసిన మొక్కజొన్న, మినుము తడిచిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ సుబ్రమణ్యం

జూపాడుబంగ్లా: వాహన డ్రైవర్లు రోడ్డు భద్రత, నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం జూపాడుబంగ్లాలోని వైఎస్సార్ ఫంక్షన్ హాలులో రోడ్డు భద్రత నిబంధనలపై ఆటోడ్రైవర్లు, ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు, ప్రైవేటు వాహనదారులు సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. వాహనాలను నిర్ణీతవేగంతో రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ నడపాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రాణాపాయం కొనితెచ్చుకోవద్దని హితవు పలికారు. మలుపుల వద్ద, వాహనాలను క్రాస్ చేసేటప్పుడు, ఎదురుగా వచ్చే వాహనాలకు దారిచ్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆటోల్లో టేప్‌రికార్డులు ఉంచుకొని అధికంగా సౌండు పెట్టుకొని నడపటం, డ్రైవర్‌కు రెండు వైపులా ప్రయాణికులను కూర్చొబెట్టుకోవడం వంటివి చేయరాదన్నారు. ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురిచేసి ప్రయాణికుల ప్రాణాలు బలితీసుకొంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వివిధ గ్రామాల ఆటో డ్రైవర్లు, ద్విచక్రవాహనదారులు పాల్గొన్నారు.

రహదారులను బాగు చేయాలి



గుంతలు పడిన రహదారిని చూపుతున్న సీపీఎం నాయకులు

మిడుతూరు: నందికొట్కూరు నుంచి నంద్యాల వెళ్లే రహదారి, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారినా పట్టించుకోరా? అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు ప్రశ్నించారు. బుధవారం నందికొట్కూరు-నంద్యాల ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలను పాఠశాల విద్యార్థులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులతో పాటు నంద్యాల-నందికొట్కూరు ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతినిందన్నారు. వాహనదారులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. త్వరితగతిన నిధులు మంజూరు చేసి రహదారులను బాగు చేయాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు పక్కిరిసాహెబ్, బెస్త రాజు, గోపాలకృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కజొన్న వర్షార్పణం



నీట మునిగిన మొక్కజొన్న పంట

బండిఆత్మకూరు: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో బండిఆత్మకూరు మండలం ఎర్రగుంట్ల గ్రామంలో సుమారు వెయ్యి ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతింది. గత ఏడాది మొక్కజొన్నలో మంచి లాభాలు రావడంతో చాలా మంది ఈ ఏడాది పంట సాగు చేశారు. అయితే రైతులకు నిరాశే మిగిలింది. పంట కోత దశకు వచ్చే సమయానికి భారీ వర్షాలు కురవడంతో పంట దెబ్బతింది. తాము తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

వార్షిక కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ

వెలుగోడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వార్షిక కార్యాచరణ ప్రణాళికపై ఈనెల 18, 19 తేదీల్లో శిక్షణ తరగతులు ఉంటాయని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. పంచాయతీల పరిపాలన విధానం, ఏపీపీఆర్ చట్టం, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, గ్రామపంచాయతీ ఆస్తులు తదితర అంశాలపై ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ ఉంటుందని చెప్పారు.

భక్తులతో మర్యాదగా మెలగాలి



భక్తులతో మాట్లాడుతున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణ భవనంలో భక్తులతో మర్యాదగా మెలగాలని దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన అన్నప్రసాద వితరణ భవనాన్ని పరిశీలించారు. అన్నప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులతో మాట్లాడారు. అనంతరం వంటశాలలో అన్నప్రసాద వితరణకు వండిన వంటకాలను పరిశీలించారు. రాబోయే కార్తీకమాసంలో భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద వితరణకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. కూరగాయలు తాజాగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వంటశాలను, భోజనశాలను, అన్నప్రసాద ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తుండాలన్నారు. అన్నప్రసాద వితరణకు సమయ పాలన పాటించాలన్నారు. ఎక్కువ సేపు భక్తులను వేచి ఉండనివ్వకుండా చూడాలన్నారు. ఈఓ వెంట అన్నప్రసాద వితరణ పర్యవేక్షకులు మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

శ్రీశైలంలో పౌర్ణమి పూజలు



స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం



స్వామిఅమ్మవార్లకు ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానంలో స్వామిఅమ్మవార్లకు బుధవారం విశేష పూజలు నిర్వహించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించి, మహా గణపతి పూజ జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు చేశారు. అనంతరం ఊయల సేవను నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు చేశారు.

రైతు సేవా కేంద్రాల్లో జాబితా ప్రదర్శన

వెలుగోడు: రైతు సేవా కేంద్రాల్లో రైతులు సాగుచేసిన పంటల జాబితాను ప్రదర్శించామని.. ఏవైనా తప్పులు సరి చేసుకోవడానికి ఇది చివరి అవకాశం అని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని బోయరేవుల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రానున్న రెండు రోజులు మండలంలో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపాలన్నారు. నష్టపోయిన పంటలు వేగంగా కోలుకోవడానికి పైపాటుగా నీటిలో కరిగే ఎరువులను వేయాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వేప కషాయం తయారీ గురించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సిబ్బంది అర్పత్, మెహబూబ్, కృష్ణస్వామి, నాగేంద్ర ఉన్నారు.

జాబితాలో సవరణకు చివరి అవకాశం

ఆత్మకూరు: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్ ఈ-పంట నమోదు చేసిన జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. వివరాల్లో తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. ఈ నెల 18వ తేదీ తుది జాబితా ప్రదర్శిస్తామని తెలిపారు.

మహానంది వ్యవసాయ కళాశాల పూర్వవిద్యార్థుల ప్రతిభ

మహానంది: మహానంది వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఇటీవల వెలువరించిన ఫలితాల్లో కళాశాల పూర్వ విద్యార్థి నెల్లూరు జిల్లాకు చెందిన టి.లక్ష్మీభార్గవి జాతీయ స్థాయిలో మొదటి, కర్నూలు జిల్లాకు చెందిన రవిచంద్ర 39వ, నాగర్ కర్నూలుకు చెందిన మధుకుమార్ 76వ ర్యాంకు సాధించి పోస్టింగులు పొందారన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



సబ్‌జైల్‌ను తనిఖీ చేసిన జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకటశేషాద్రి

నందికొట్కూరు: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి సూచించారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు ఆయన బుధవారం పట్టణంలోని సబ్‌జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదిని నియమించి సేవలందిస్తామన్నారు. ఖైదీలకు మంచి ఆహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. జైలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈయన వెంట జైల్ విజిటింగ్ లాయర్ అరుణ్‌కుమార్, సబ్ జైల్ సూపరింటెండెంట్ జనార్దన్, తదితరులు ఉన్నారు.

ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

నందికొట్కూరు: ప్రతి గ్రామ పంచాయతీ ఉప సర్పంచు, ఇద్దరు వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పరిపాలనపై ప్రతి ఉప సర్పంచు, ఇద్దరు వార్డు సభ్యులకు ఈ నెల 18, 19వ తేదీల్లో శిక్షణ ఉంటుందని వెల్లడించారు.

నేడు వాల్మీకి జయంతి

మిడుతూరు: మండల పరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామంలో వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు వాల్మీకి సంఘం సభ్యులు బుధవారం తెలిపారు. గ్రామంలో ఉదయం 7 గంటలకు గణపతి పూజ, 8:30 గంటలకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మహామంగళ హారతి, తీర్థప్రసాదాలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం వాల్మీకి దేవాలయం నుంచి భారీ ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామస్తులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సుంకేసుల గ్రామంలో ధార్మిక ఉపన్యాసం

మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో శ్రీ రామదత్తాశ్రమంలో వాల్మీకి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకుడు మల్లికార్జున రావు బుధవారం తెలిపారు. విశ్వాత్మానంద స్వామి హాజరై ధార్మికోపన్యాసం చేస్తారని చెప్పారు. వాల్మీకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

డీ-వార్మింగ్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

పగిద్యాల: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే నట్టల నివారణ(డీ-వార్మింగ్) కార్యక్రమాన్ని గొర్రెల కాపరులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సూచించారు. బుధవారం మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో గొర్రెలకు నట్టల నివారణ మందును తాపించారు. ఎమ్మెల్యే హాజరై గొర్రెల కాపరులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయంతో పాటు రైతులు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అలాగే జీవనోపాధులను మెరుగుపర్చుకోవడానికి పొదుపు మహిళలకు డ్వాక్రా సంఘాల ద్వారా గొర్రెల పెంపకం, కోళ్ల పెంపకం, అగ్గిపెట్టెల తయారీ, పేపర్ ప్లేట్స్ తయారీ తదితర యూనిట్లు స్థాపించుకోవడానికి రుణాలు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల చివరి వరకు డీ వార్మింగ్ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పశువైద్యులు మండ్ల సుమన్, ఏహెచ్ఏ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏఈఓను తొలగించాలని డిమాండ్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఏఈఓగా విధులు నిర్వహిస్తూ సస్పెండ్‌కు గురైన ఎం.ఫణీధర ప్రసాద్‌ను శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంతిరెడ్డి అరవిందరెడ్డి డిమాండ్ చేశారు. ఏఈఓ అవినీతికి పాల్పడ్డారని.. శ్రీశైల దేవస్థానానికి చెందిన స్థలాలను ఆష్టారాజ్యంగా కేటాయించారని ఆరోపించారు. ఆయనపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామం వద్ద నాగసాయి విద్య బ్రహ్మ ఆశ్రమం ఆవరణలో శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. బుధవారం రాఘవేంద్రస్వామి, లక్ష్మి సమేత నరసింహస్వామి, ధన్వంతరి, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, పీఠాధిపతి మాతృమూర్తులు, ధ్వజస్తంభం ప్రతిష్ట చేశారు. పీఠాధిపతి రామానంద స్వామి మాట్లాడుతూ ఆశ్వియుజ మాసంలో గురుదేవుల ఆన మేరకు ఒకే రోజులో విగ్రహాలు ధ్వజస్తంభం తయారు చేయించి ప్రతిష్ట చేయడం జరిగిందన్నారు. ప్రాణప్రతిష్ట, హోమం, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

అంతర్గత రోడ్లకు నిధుల మంజూరు

పాములపాడు: అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.29.25 లక్షల నిధులు మంజూరైనట్లు సర్పంచు మేకల భాగ్యమ్మ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంజూరైన నిధులతో గ్రామంలో 4 సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, లింగాల సర్పంచ్ మల్లీశ్వరరెడ్డి, జేఈ రాఘవేంద్రప్రసాద్, ఏపీఓ విమలమ్మ పాల్గొన్నారు.

మందుబాబులకు 'చుక్కె'దురు!



ఖాళీ చేసిన ప్రభుత్వ మద్యం దుకాణం

మహానంది: మద్యం బాబులకు చుక్కెదురైంది. చుక్క లేక చుక్కలు చూశారు. మహానంది మండలంలో మహానంది, తిమ్మాపురం గ్రామాల్లో వైన్ షాపులు బుధవారం తెరుచుకోకపోవడంతో నిరాశ చెందారు. ఎం.తిమ్మాపురంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న వైన్‌షాపు వద్ద చుట్టుపక్కల నివాసాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం నిర్వహించేందుకు ఒప్పుకునేది లేదంటూ సమీప ఇళ్ల ప్రజలు తేల్చిచెప్పారు. మహానందిలో అనువైన గదుల కోసం అన్వేషిస్తున్నారు. దీంతో చేసేదేమిలేక మద్యం బాబులు అటు నంద్యాలకు వెళ్లి కొందరు, మరికొందరు బ్లాక్‌లో కొనుగోలు చేసి తాగాల్సి వచ్చింది.

సున్నిపెంటలో ఏర్పాటుకాని మద్యం దుకాణాలు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో రెండు మద్యం దుకాణాలు తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారికి లాటరీలో దక్కాయి. దుకాణాల ఏర్పాటు ఆలస్యం అవుతుందనే సమాచారంతో కొందరు ప్రభుత్వ మద్యం దుకాణంలో ఉన్న సరుకును కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. 16వ తేదీ నుంచి ప్రైవేటు దుకాణాలు తెరుస్తారనే ఆశతో మందు ప్రియులు ఉన్నారు. కానీ పర్మిట్‌ధారులతో అధికారపార్టీ నేతలు, స్థానిక నేతలతో సిండికేట్ కావాలని చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో షాపుల ఏర్పాటు కాకపోవడంతో మందు ప్రియులు బార్డర్‌లో ఉన్న తెలంగాణా మద్యం షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి



మిడుతూరు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో ఓ రైతుకు చెందిన ఎద్దు పిడుగుపాటుకు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. రైతు తెలిపిన వివరాల మేరకు.. సుంకేసులకు చెందిన తెలుగు వెంకటరమణయ్య తన పొలంలో వేపచెట్టుకు ఎద్దును కట్టేసి పొలంలో మందు పిచికారీ చేస్తుండగా బుధవారం ఉదయం వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పడటంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు మృతి చెందడంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు. పిడుగుపాటుతో ఎద్దు మృతి చెందిందని పేర్కొంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు.

జాబ్‌మేళా పోస్టర్ల ఆవిష్కరణ

ఆత్మకూరు: ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు బుధవారం జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 22వ తేదీ ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా ఉంటుందని తెలిపారు. నాలుగు కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7673902328, 9182217075 నంబర్లను సంప్రదించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

సీసీ రోడ్లకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: కూటమి ప్రభుత్వంలోనే పంచాయతీలకు నిధులు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని బిజినవేముల, కొణిదేల గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. బిజినవేముల గ్రామంలో సర్పంచు రవియాదవ్ ఆధ్వర్యంలో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే భూమి చేశారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాలకు నిధులు మంజూరు చేసిందన్నారు. అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు గ్రామాలను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని చెప్పారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని జి.వీరాపురం గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమాన్ని ఎంపీడీఓ మేరి బుధవారం నిర్వహించారు. గ్రామంలోని పలు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు సర్పంచు బోరెడ్డి సరస్వతి ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో 3 కాలనీలకు సీసీ రోడ్లను నిర్మించేందకు భూమిపూజ చేశామన్నారు. ఈ రోడ్ల నిర్మాణాలకు సుమారు రూ.12 లక్షలు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. పీఆర్ ఏఈ మద్దిలేటి, ఏపీఎం పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి చాందిని తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలో బుధవారం సర్పంచ్ మొట్టె బాలయ్య ఆధ్వర్యంలో రూ.80 లక్షలతో పది సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గోపికృష్ణ మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీటీసీ మోతె వెంకటమ్మ, పీఆర్ ఏఈ బషీర్, ఏపీఓ గౌరీబాయి, ఈసీ నజీర్‌బాషా పాల్గొన్నారు.